సాక్షి
పశ్చిమగోదావరి
గురువారం । 28 । డిసెంబర్ । 2023



మెరిసిన ఆట
ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా 2023లో క్రీడల్లో మెరిసింది. ఈ ఏడాది జిల్లా క్రీడాకారులు పలు పోటీల్లో రాణించి అద్భుత ఫలితాలు సాధించారు. 8లో ▸



హృద్రోగులకు తక్షణ వైద్యం
హృద్రోగుల ప్రాణాలను నిలబెట్టడానికి కైకలూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో తక్షణ వైద్యం అందుబాటులోకి వచ్చిందని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు తెలిపారు. 8లో ▸



ఐకమత్యంతోనే పరిష్కారం
ఉద్యోగులంతా ఐకమత్యంగా పనిచేసి సమస్యలు పరిష్కరించుకోవచ్చని విద్యుత్‌శాఖ ఓసీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ సమావేశంలో వక్తలు అన్నారు. 8లో ▸

సీఎం పర్యటనకు శరవేగంగా ఏర్పాట్లు

- 29న ఉదయం 10.40కు భీమవరం చేరుకోనున్న సీఎం జగన్
- విద్యాదీవెన నిధులు విడుదల చేయనున్న ముఖ్యమంత్రి
- 50 వేల మందికి సరిపడేలా సభా ప్రాంగణం సిద్ధం
- సభ అనంతరం మధ్యాహ్నం 1.45 గంటలకు తిరుగు ప్రయాణం
- ఏర్పాట్లను పరిశీలించిన ప్రభుత్వ విప్ గ్రంధి


సిద్ధమవుతున్న సభా ప్రాంగణం

సాక్షి, భీమవరం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భీమవరం పర్యటనకు జిల్లా అధికార యంత్రాంగం శరవేగంగా ఏర్పాట్లు చేస్తోంది. 50 వేల మందికి పైగా హాజరయ్యేందుకు వీలుగా సభాప్రాంగణం సిద్ధమవుతోంది. హెలీప్యాడ్ నుంచి సభాప్రాంగణం వరకు మూడు కిలోమీటర్ల మేర రోడ్‌షోకు ఏర్పాట్లు చేస్తున్నారు. శుక్రవారం భీమవరం వేదికగా జగనన్న విద్యాదీవెన పథకం కింద రాష్ట్ర వ్యాప్తంగా తల్లుల ఖాతాలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను సీఎం జగన్ బటన్‌నొక్కి విడుదల చేయనున్నారు. ఉదయం 10.40కు స్థానిక మున్సిపల్ కార్యాలయం పక్కనే లూథరన్ హైస్కూల్ ఆవరణలో ఏర్పాటుచేసిన ఆవరణకు చేరుకుని మధ్యాహ్నం 1.45 గంటల వరకు సీఎం భీమవరంలో వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటారు. సీఎం పర్యటన కోసం బైపాస్ రోడ్డులోని గ్రంధి వెంకటేశ్వరరావు ప్రభుత్వ జూనియర్ కాలేజీ సమీపంలో అధికారులు బహిరంగ సభ వేదికను సిద్ధం చేస్తున్నారు. భారీ ఎత్తున ప్రజలు తరలిరానున్న నేపథ్యంలో తొక్కిసలాట జరగకుండా బారికేడ్లు ఏర్పాటుచేయిస్తున్నారు. ప్రజాప్రతినిధులు, వీఐపీలు, అధికారులు, ప్రజలు కూర్చునేందుకు వీలుగా ప్రత్యేక గ్యాలరీలు సిద్ధం చేస్తున్నారు. హెలిప్యాడ్ నుంచి సభావేదిక వరకు దారిపొడవునా సుందరీకరణ పనులు చేపట్టారు. మరోపక్క జననేతకు స్వాగతం పలుకుతూ రోడ్‌షో మార్గం మొత్తాన్ని ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు భారీ ఎత్తున ఫ్లెక్సీలు, పార్టీ జెండాలతో సర్వాంగ సుందరంగా ముస్తాబుచేస్తున్నారు.

ఏర్పాట్లు పరిశీలించిన ప్రభుత్వ విప్
సీఎం పర్యటన విజయవంతానికి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ దగ్గరుండి ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. బుధవారం హెలీప్యాడ్, సభా ప్రాంగణంను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. రోడ్‌షోలో దారిపొడవునా సీఎం జగన్‌కు స్వాగత ఏర్పాట్లపై పార్టీ శ్రేణులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ గ్రంధి శ్రీనివాస్ మాట్లాడుతూ సంక్షేమ సారథికి ఘన స్వాగతం పలికేందుకు నియోజకవర్గ ప్రజానీకం ఎంతో ఆతృతగా ఎదురుచూస్తున్నారన్నారు. పర్యటన విజయవంతానికి ఘనంగా ఏర్పాట్లు చేశామని వివరించారు.

ఏర్పాట్లపై కలెక్టర్ సమీక్ష
భీమవరం (ప్రకాశంచౌక్): ముఖ్యమంత్రి బహిరంగ సభకు వచ్చే ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా పగడ్బందీగా ఏర్పాట్లు పూర్తి చేయాలని సంబంధిత అధికారులను కలెక్టరు పి.ప్రశాంతి ఆదేశించారు. కలెక్టరు క్యాంపు కార్యాలయంలో ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో జాయింటు కలెక్టరు ఎస్.రామ సుందర్ రెడ్డితో కలసి కలెక్టరు సమీక్షించారు. సభా వేదిక ప్రాంతంలో, బస్సుల్లో అల్పాహారం, తాగునీటి ఏర్పాట్లు చేయాలన్నారు. అవసరమైన చోట బయో టాయిలెట్లు సిద్ధం చేయాలన్నారు. సభాస్థలికి చేరే రూటు మ్యాప్‌లు అందరికీ తెలిసేలా ప్రధాన కూడళ్లలో ప్రదర్శించాలన్నారు. విద్యుత్తు సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని ట్రాన్స్‌కో అధికారులను ఆదేశించారు. సభాస్థలి అందరికీ తెలిసేలా బెలూన్లు ఏర్పాట్లు చేయాలన్నారు. కార్యక్రమంలో డీఆర్వో బి.శివ నారాయణ రెడ్డి, ఆర్డీవో కె.శ్రీనివాసులు రాజు, ట్రైనీ డిప్యూటీ కలెక్టరు కానాల సంగీత్ మాధుర్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం పర్యటన సాగేదిలా..

సీఎం వైఎస్ జగన్ భీమవరం పర్యటనకు సంబంధించిన షెడ్యూల్‌ను జిల్లా సమాచారశాఖ మీడియాకు విడుదల చేసింది.

- 29వ తేదీ ఉదయం 10 గంటలకు తాడేపల్లి నుంచి బయలుదేరి 10.05 గంటలకు తాడేపల్లిలోని హెలీప్యాడ్ వద్దకు చేరుకుంటారు.
- 10.10 గంటలకు హెలికాప్టర్‌లో బయలుదేరి 10.40 గంటలకు భీమవరం లూథరన్‌హైస్కూల్ గ్రౌండ్‌లో నిర్మించిన హెలీప్యాడ్ వద్దకు చేరుకుంటారు. కొద్దిసేపు అక్కడ ప్రజా ప్రతినిధులతో మమేకమవుతారు.
- 10.55 గంటలకు హెలీప్యాడ్ వద్ద నుంచి బయలుదేరి 11.15 గంటలకు సభ ప్రాంగణానికి చేరుకుని జగనన్న విద్యా దీవెన నిధులు విడుదల చేసి ప్రసంగిస్తారు.
- మధ్యాహ్నం 12.30 గంటలకు సభ నుంచి బయల్దేరి 12.40 గంటలకు లూథరన్ హైస్కూల్ హెలీప్యాడ్ వద్దకు చేరుకుంటారు. అక్కడ ప్రజా ప్రతినిధులు, స్థానిక నాయకులతో మమేకమవుతారు.
- మధ్యాహ్నం 1.45 గంటలకు లూథరన్ హైస్కూల్ నుంచి హెలికాప్టర్‌లో తాడేపల్లి పయనమవుతారు.


సభకు ఏర్పాట్లను పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్ గ్రంధి శ్రీనివాస్


సభ ఏర్పాట్లపై అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

న్యూస్‌రీల్

డీఐజీ అశోక్‌కుమార్‌కు ఐజీగా పదోన్నతి


జీవీజీ అశోక్ కుమార్, ఏలూరు రేంజ్ డీఐజీ

ఏలూరు టౌన్: ఏలూరు రేంజ్ డీఐజీగా పనిచేస్తోన్న జీవీజీ అశోక్ కుమార్‌కు ఐజీగా పదోన్నతి కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. ఏలూరు రేంజ్ డీఐజీగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం సమర్థవంతంగా పనిచేస్తూ నేరాల నిరోధానికి విశేష కృషి చేస్తోన్న అశోక్‌కుమార్‌కు పదోన్నతి కల్పించారు. రాష్ట్ర వ్యాప్తంగా మరో 9 మంది డీఐజీలకు ఐజీలుగా పదోన్నతి కల్పించారు. జీవీజీ అశోక్‌కుమార్ తొలుత 1996లో డీఎస్పీగా పోలీస్‌శాఖలో ప్రవేశించారు. డీఎస్పీగా అనంతపురం, గుంటూరులో పనిచేశారు. ఉమ్మడి రాష్ట్రంలో హైదరాబాద్ ట్రాఫిక్ డీసీపీగా విధులు నిర్వర్తించారు. అనంతరం తిరుమల తిరుపతి దేవస్థానం చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్‌గా, కడప, అనంతపురం జిల్లాల ఎస్పీగా పనిచేశారు. విజయవాడలో ఏసీబీ విభాగంలో ఎస్పీగా పనిచేసిన అనంతరం డీఐజీగా పదోన్నతి పొంది విధులు నిర్వర్తించారు. ఇటీవల ఏలూరు రేంజ్ డీఐజీగా బదిలీ అయ్యారు. తాజాగా ఆయనకు ఐజీగా పదోన్నతి లభించింది.

10వ తరగతి పరీక్ష ఫీజుకు 2 వరకూ గడువు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): వచ్చే మార్చిలో జరగనున్న 10వ తరగతి పబ్లిక్ పరీక్షలు రాసే విద్యార్థులు ఫీజు చెల్లించడానికి ఈ నెల 28 నుంచి జనవరి 2 వరకూ మాత్రమే గడువు ఉందని జిల్లా విద్యాశాఖాధికారి పీ. శ్యామ్ సుందర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు జిల్లాలోని అన్ని ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపల్, ఎయిడెడ్, అన్ ఎయిడెడ్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తమ పరిధిలో వచ్చే పరీక్షలకు హాజరుకాగోరు విద్యార్థులకు ఈ విషయం తెలిపి రూ. 500 అపరాధ రుసుంతో పరీక్ష ఫీజు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. విద్యార్థులు ఫీజు చెల్లించడానికి ఇదే ఆఖరి అవకాశమని, మరోసారి గడువు తేదీ ఎట్టి పరిస్థితిలో పొడిగించరని స్పష్టం చేశారు. మార్చిలో జరిగే పరీక్షలకు ఫీజులు చెల్లించి పరీక్షలు రాసినవారు మాత్రమే అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు రాయడానికి అర్హులవుతారని తెలిపారు.

పారిజాతగిరిలో హుండీ లెక్కింపు


జంగారెడ్డిగూడెం గోకుల తిరుమల పారిజాతగిరిలో హుండీ లెక్కింపు

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం గోకుల తిరుమల పారిజాత గిరి శ్రీవెంకటేశ్వర స్వామి దేవస్థానంలో బుధవారం హుండీ లెక్కింపు నిర్వహించారు. ధనుర్మాసం సందర్భంగా ఆలయంలో ఉదయం 5 గంటలకు గోదాదేవి తిరుప్పావై ప్రవచనం అత్యంత వైభవంగా ఆలయ అర్చకుడు నల్లూరి రవికుమార్ ఆచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం హుండీ లెక్కింపు నిర్వహించారు. 92 రోజులకు రూ.13,00,478 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో మానికల రాంబాబు తెలిపారు.

వైద్య శాఖలో పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

భీమవరం(ప్రకాశంచౌక్): ప్రాంతీయ వైద్య ఆరోగ్య సంచాలకుడు, జోన్–2 రాజమహేంద్రవరం పరిధిలోని ఎంఎల్‌హెచ్‌సీ/సీహెచ్‌ఓ పోస్టులను కాంట్రాక్టు పద్ధతిలో భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ జారీ చేశారని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి శర్మిష్ట బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నోటిఫికేషన్‌కు సంబంధించిన వివరాలు జోన్–2 పరిధిలోని ఏలూరు జిల్లా వెబ్‌సైట్‌లో పొందుపర్చారన్నారు. సంబంధిత ధ్రువీకరణ పత్రాలతో జోన్–2 ప్రాంతీయ వైద్య ఆరోగ్య సంచాలకుల కార్యాలయంలో ఈ నెల 28 నుంచి జనవరి 12 వరకూ దరఖాస్తులు సమర్పించాలన్నారు. దరఖాస్తులను ప్రాంతీయ వైద్య ఆరోగ్య సంచాలకుడు జోన్–1, రాజమహేంద్రవరం గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ ప్రాంగణంలో సమర్పించవచ్చని ఆ ప్రకటనలో తెలిపారు.

విజిలెన్స్ డిప్యూటీ కలెక్టర్‌గా దేవకీ దేవి

ఏలూరు(మెట్రో): రాష్ట్ర ప్రభుత్వం డిప్యూటీ కలెక్టర్ల బదిలీలు చేపట్టింది. దీనిలో భాగంగా ఏలూరు జిల్లా సివిల్ సప్లయిస్ విజిలెన్స్ డిప్యూటీ కలెక్టర్ లోలుగు దేవకీదేవిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా పలువురు తహసీల్దార్‌లకు రాష్ట్ర ప్రభుత్వం పదోన్నతులు కల్పించి వారికి పోస్టింగ్‌లు ఇచ్చింది.

న్యూ ఇయర్ వేడుకలు ప్రశాంతంగా జరుపుకోవాలి


డీ మేరీ ప్రశాంతి, జిల్లా ఎస్పీ

ఏలూరు టౌన్: ఏలూరు జిల్లా ప్రజలందరూ నూతన సంవత్సర వేడుకలను ప్రశాంతమైన వాతావరణంలో జరుపుకోవాలని, అసాంఘిక కార్యకలాపాలకు చెక్ పెడుతూ అనుమతి మేరకు మాత్రమే వేడుకలు చేసుకోవాలని జిల్లా ఎస్పీ డీ మేరీప్రశాంతి తెలిపారు. ఈ నెల 31 రాత్రి 10 గంటల నుంచి అర్ధరాత్రి ఒంటి గంట వరకు మాత్రమే సంబరాలు చేసుకునేందుకు అనుమతి ఉందని స్పష్టం చేశారు. నూతన సంవత్సర వేడుకల సందర్భంగా నిర్వాహకులు లౌడ్‌స్పీకర్లు, మ్యూజిక్ సిస్టమ్ వినియోగించేందుకు విధిగా సంబంధిత పోలీస్ అధికారుల ముందస్తు అనుమతి తీసుకోవాలని చెప్పారు. వేడుకల్లో భాగంగా అశ్లీల నృత్యాలు, సినిమాలు, అసాంఘిక కార్యకలాపాలు లేకుండా జరుపుకోవాలని సూచించారు. నూతన సంవత్సర వేడుకల్లో ప్రమాదకర విన్యాసాలు, పేలుడు పదార్థాలు వినియోగించరాదని చెప్పారు. అతిగా మద్యం సేవించి మితిమిరిన వేగంతో వాహనాలు నడిపేవారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. మహిళలు ఒంటరిగా ఉన్న ప్రాంతాల్లోకి వెళ్లి వారిపై వేధింపులకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

1,500 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరిక

టీడీపీ, జనసేన నుంచి భారీగా వలసలు




తణుకులో వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో మంత్రి కారుమూరి, ఎమ్మెల్సీ రవీంద్రనాథ్, ఎమ్మెల్యే జగ్గిరెడ్డి తదితరులు

తణుకు అర్బన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చరిష్మాతో వైఎస్సార్‌సీపీ కుటుంబంలో చేరుతున్న ప్రతి ఒక్కరికి మనస్ఫూర్తిగా స్వాగతం పలుకుతున్నామని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. తణుకు సీఎం ఫంక్షన్ హాలులో బుధవారం నిర్వహించిన సమావేశంలో తణుకు నియోజకవర్గానికి చెందిన టీడీపీ, జనసేన నుంచి 1,500 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరాయి. ఈ సందర్భంగా కారుమూరి మాట్లాడుతూ సీఎం జగన్ వెంట ఉంటే అందరికీ మంచి జరుగుతుందనే నమ్మకం ప్రజల్లో ఉందనడానికి చేరికలే నిదర్శనమన్నారు. అందరికి మంచి చేయడం, పెట్టే స్వభావమున్న మంచి మనసున్న వ్యక్తి జగనన్న అన్నారు. గత ప్రభుత్వ హయాంలో జన్మభూమి కమిటీల పేరుతో ప్రజల కష్టాన్ని దోచేశారని, నేడు సీఎం జగన్ అవినీతిరహితంగా పరిపాలన అందించడాన్ని ప్రజలంతా స్వాగతిస్తున్నారని అన్నారు.

టీడీపీ మోసపూరిత పార్టీ
టీడీపీ మోసపూరిత పార్టీ అని, పచ్చి అవకాశవాద పార్టీ జనసేన అని ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం అధ్యక్షుడు పి.విజయబాబు అన్నారు. రాజకీయాల్లో కుల ప్రస్తావనలు గతంలో ఎన్నడూ లేవని ఏపీలో టీడీపీ, జనసేనలతోనే ఆ పరిస్థితి దాపురించిందని విమర్శించారు. గోదావరి ప్రాంతవాసుల్ని చంద్రబాబుకు అమ్మేసేందుకు జనసేన నేత చూస్తున్నాడని, వారి ఆత్మగౌరవాన్ని సైతం చంద్రబాబుకు తాకట్టు పెట్టేశాడని దుయ్యబట్టారు. ఈ రెండు దగాకోరు పార్టీలను ఢీకొట్టి వైఎస్సార్‌సీపీ విజయదుందుభి మోగిస్తుందని అన్నారు.

అహర్నిశలు శ్రమిస్తున్న కారుమూరి
ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అప్పగించిన బాధ్యతలను తూచాతప్పకుండా పాటిస్తూ అహర్నిశలూ శ్రమిస్తున్న మంత్రి కారుమూరికి ప్రత్యేకంగా ధన్యవాదాలు చెబుతున్నామని కొత్తపేట ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి, ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి 3 రోజుల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బులు వేయించిన ఘనత మంత్రి కారుమూరికే దక్కుతుందని అన్నారు. ఈ సందర్భంగా తణుకు నియోజకవర్గ పరిధిలోని తణుకు మున్సిపాలిటీ, తణుకు, అత్తిలి, ఇరగవరం మండలాల నుంచి వచ్చిన 1500 కుటుంబాలు పార్టీలో చేరగా, వారికి మంత్రి కారుమూరి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వైద్యవిభాగం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ దాట్ల సుందరరామరాజు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, వైఎస్సార్‌సీపీ తణుకు, అత్తిలి, ఇరగవరం మండల అధ్యక్షులు బోడపాటి వీర్రాజు, పైబోయిన సత్యనారాయణ, కొప్పిశెట్టి దుర్గాప్రసాద్, జేసీఎస్ పట్టణ కన్వీనర్ యిండుగపల్లి బలరామకృష్ణ, ఏఎంసీ వైస్ చైర్మన్ మారిశెట్టి శివ శంకర్, తణుకు పట్టణం, తణుకు, అత్తిలి, ఇరగవరం మండలాల మహిళాధ్యక్షులు నూకల కనక దుర్గ, చంద్రు శ్యామల రత్నకుమారి, కాకర్ల విశాలాక్షి, మెట్ల కిరణ్మయి, నియోజకవర్గ ఎస్సీసెల్ అధ్యక్షుడు పొట్ల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా 'ఆడుదాం ఆంధ్ర'

- ఏలూరు జిల్లాలో 2,550 మ్యాచ్‌ల్లో 25,500 మంది పోటీ
- పశ్చిమ గోదావరిలో 830 మ్యాచ్‌ల నిర్వహణ


ఆకివీడు మండలం సిద్ధాపురంలో వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు


ఏలూరులో ఆడుదాం ఆంధ్రలో ఖో ఖో ఆడుతున్న క్రీడాకారులు


ఏలూరు ఏఎస్ఆర్ స్టేడియంలో క్రికెట్ ఆడుతున్న క్రీడాకారులు


అత్తిలి మండలం బల్లిపాడులో వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు

ఏలూరు రూరల్: ఏలూరు జిల్లాలో ఆడుదాం ఆంధ్ర ఫీవర్ కొనసాగుతోంది. గ్రామాలు, పట్టణాల్లో ఆటల పోటీలు కోలాహలంగా సాగుతున్నాయి. రెండో రోజు విద్యార్థులతో పాటు యువత ఉత్సాహంగా పోటీల్లో పాల్గొన్నారు. సచివాలయ స్థాయిలో పోటీలు జరగడంతో పండుగ వాతావరణం నెలకొంది. నియోజకవర్గ స్థాయి పోటీల్లో గెలుపొందిన విజేతలకు ప్రభుత్వం నగదు బహుమతి ప్రకటించడంతో క్రీడాకారుల్లో ఉత్సాహం వెల్లివిరుస్తోంది. విజయం కోసం హోరాహోరీగా తలపడుతున్నారు. సచివాలయ స్థాయి జట్లు జిల్లా స్థాయిలో తలపడాలనే భావన కనిపిస్తోంది. మొదట రెండురోజులు గ్రామీణ ప్రాంతాల్లో వాలీబాల్ కబడ్డీ, ఖో ఖో, వాలీబాల్ పోటీలు జరిగాయి. పట్టణాల్లో క్రికెట్, బాడ్మింటన్ పోటీలు జరుగుతున్నాయి. .

ఏలూరు జిల్లాలో 2,550 మ్యాచ్‌లు
ప్రభుత్వం పక్కా ప్రణాళికతో పోటీలు నిర్వహించడంతో బుధవారం సాయంత్రానికి జిల్లా వ్యాప్తంగా అధికారులు 2,550 మ్యాచ్‌లు నిర్వహించారు. మొదటరోజు మంగళవారం 1,370 మ్యాచ్‌లు జరగాల్సి ఉండగా 1,300 మ్యాచ్‌లు జరిగాయి. బుధవారం 1,262 మ్యాచ్‌లకు గాను 1,200 మ్యాచ్‌లు జరిగాయి. సచివాలయ స్థాయిలో జరుగుతున్న మ్యాచ్‌లన్నీ ఎప్పటికప్పుడు సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. జిల్లా మొత్తంగా బుధవారం సాయంత్రం నాటికి 2,550 మ్యాచ్‌లు జరిగాయి.

ఏలూరు జిల్లా పరిధిలో..

- చింతలపూడి నియోజకవర్గంలో చింతలపూడిలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో, కామవరపుకోట జెడ్పీ హైస్కూల్లో, లింగపాలెం మండలం ధర్మాజీగూడెం హైస్కూల్లో, జంగారెడ్డిగూడెం జెడ్పీ హైస్కూల్లో, జంగారెడ్డిగూడెం మండలం దేవులపల్లి జెడ్పీ హైస్కూల్లో ఆడుదాం ఆంధ్ర ఆటల పోటీలు నిర్వహించారు.
- దెందులూరు నియోజకవర్గంలో దెందులూరు, పెదవేగి, పెదపాడు మండలాల్లోని జెడ్పీ హైస్కూల్లో పోటీలు కొనసాగుతున్నాయి.
- ఏలూరు ఏఎస్ఆర్ స్టేడియం, 14, 15, 20, 26 తదితర డివిజన్ పరిధిలోని నగర పాలక పాఠశాలల ఆట స్థలాల్లో పోటీలు జరిగాయి.
- కైకలూరు నియోజకవర్గంలోని కైకలూరు, కలిదిండి, ముదినేపల్లి, మండవల్లి మండలాల్లో ఆడుదాం ఆంధ్ర పోటీలు నిర్వహిస్తున్నారు.
- నూజివీడు నియోజకవర్గంలో నూజివీడు, ముసునూరు, ఆగిరిపల్లి, చాట్రాయిల్లోని జెడ్పీ హైస్కూళ్లలో పోటీలు నిర్వహించారు.
- పోలవరం నియోజకవర్గంలో సచివాలయాల పరిధిలో ఏడు మండలాల్లో వాలీబాల్ పోటీలు జరిగాయి.
- ఉంగుటూరు నియోజకవర్గం ఉంగుటూరు, భీమడోలు, గణపవరం, నిడమర్రు మండలాల్లోని ఆడుదాం ఆంధ్ర పోటీలను స్థానిక ప్రజాప్రతినిధులు తిలకించారు.

పశ్చిమగోదావరి జిల్లా పరిధిలో..
జిల్లాలోని 537 సచివాలయల పరిధిలో బుధవారం వాలీబాల్, క్రికెట్, ఖోఖో, కబడ్డీ తదితర అంశాల్లో మొత్తం 830 మ్యాచ్‌లు నిర్వహించారు. 9 వేల మంది క్రీడాకారులు పాల్గొన్నారు.

- ఆకివీడు మండలంలో సిద్ధాపురం, చెరుకుమిల్లి, ఆకివీడులో ఆటల పోటీలు ఉత్సాహంగా జరిగాయి. ఉండి మండలంలో ఉండి, ఎన్నార్పీ అగ్రహారం, మహాదేవపట్నం, యండగండి, ఉప్పులూరు, చెరుకువాడ, కాళ్ల మండలంలో ఏలూరుపాడు, కాళ్ల, కలవపూడి, సీసలి, కోపల్లె జెడ్పీ పాఠశాలలో పోటీలు జరిగాయి.
- పాలకొల్లు పట్టణంలోని సుభాష్‌చంద్రబోస్ స్కూల్, ఏఎస్ఏఎం గవర్నమెంట్ కళాశాల, పాలకొల్లు మండలంలోని లంకలకోడేరు, ఆగర్తిపాలెం, కొత్తపేట, చింతపర్రు, యలమంచిలి మండలంలోని సచివాలయాల పరిధిలో అధికారులు పోటీలు నిర్వహించారు.
- ఆచంట నియోజకవర్గంలో ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు పెనుమంట్ర మండలం మార్టేరులో ఆడుదాం ఆంధ్రా క్రీడలను ప్రారంభించారు. కొడమంచిలి, కొల్లూరు, సిద్ధాంతం తదితర సచివాలయల పరిధిలో ఎంపీటీసీలు, గ్రామ సర్పంచులు పోటీలను తిలకించారు.
- నర్సాపురం నియోజకవర్గంలో నర్సాపురం వైఎన్ కళాశాల, రూరల్ మండలానికి సంబంధించి స్వర్ణాంధ్ర కళాశాల, మొగల్తూరు సచివాలయాల పరిధిలో జరిగిన పోటీల్లో స్థానిక సర్పంచ్‌లు, పట్టణ స్థాయి నాయకులు పాల్గొని క్రీడాకారులను ఉత్సాహపరిచారు.
- భీమవరం నియోజకవర్గంలో వీరవాసరం మండలంలోని వీరవాసరం, రాయకుదురు, కొణితివాడ, మత్స్యపురి, అండలూరు తదితర గ్రామాల్లో పోటీలు జరిగాయి.
- తాడేపల్లిగూడెం పట్టణం 6 నుంచి 10 వార్డుల్లోని ఆటస్థలాల్లో అధికారులు ఖోఖో, కబడ్డీ పోటీలు నిర్వహించారు. తాడేపల్లిగూడెం మండలంలో మాధవరం, కృష్ణయ్యపాలెంలో కబడ్డీ, వాలీబాల్ పోటీలు జరిగాయి. పెంటపాడు మండలంలో 3 జెడ్పీ హైస్కూళ్లు, ఒక డిగ్రీ కళాశాల, ఒక ఎయిడెడ్ స్కూల్లో జరిగిన ఖోఖో, కబడ్డీ పోటీల్లో యువత ఉత్సాహంగా పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఉత్సాహంగా బాడీ బిల్డింగ్ పోటీలు



విజేతకు జ్ఞాపిక అందజేస్తున్న అతిథులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక సురేష్‌చంద్ర బహుగుణ పోలీస్ స్కూల్‌లో నగరానికి చెందిన అగ్గాల చల్లారావు ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి ఏలూరు జిల్లా స్థాయి బాడీ బిల్డింగ్ పోటీలు ఉత్సాహభరిత వాతావరణంలో జరిగాయి. జూనియర్స్, సీనియర్స్, మెన్ విభాగాల్లో అనేక మంది క్రీడాకారులు పాల్గొని తమ శరీర సౌష్టవాన్ని ప్రదర్శించారు. ఈ పోటీల్లో జూనియర్స్ టైటిల్‌ను ఎస్.రాకేష్, సీనియర్ టైటిల్‌ను కోడూరు పవన్, మెన్స్ ఫిజిక్ టైటిల్‌ను ఎస్‌కే బాబు, విభిన్న ప్రతిభావంతుల విభాగంలో ఎ.మోషే సాధించారు. విజేతలకు బొరగం ఫౌండేషన్ సహకారంతో జ్ఞాపికలు అందజేశారు. పోటీలకు న్యాయ నిర్ణేతలుగా బొరగం దుర్గాప్రసాద్ దొర, శ్రీనివాస్, ప్రకాష్ వ్యవహరించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఉంగుటూరు: అప్పుల బాధ తాళలేక పురుగు మందు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. నారాయణపురం దళితపేటకు చెందిన గెడ్డం చిరంజీవి (35) భార్య నాగలక్ష్మిని ఉపాధి నిమిత్తం కువైట్ పంపాడు. ఇందుకోసం అప్పులు చేశాడు. కొన్నాళ్లకే భార్య తిరిగి వచ్చేయడంతో అప్పులు తీర్చే మార్గం కనిపించలేదు. సాగు చేసిన కొద్దిపాటి పొలం కూడా నష్టం రావడంతో మనస్తాపంతో ఈ నెల 25న పురుగుమందు తాగాడు. వెంటనే అతనిని తాడేపల్లిగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లగా, మెరుగైన చికిత్స కోసం విజయవాడ తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. చేబ్రోలు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మెరిసిన ఆట

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా 2023 ఏడాదిలో క్రీడల్లో ఉవ్వెత్తున ఎగిసింది. ఈ ఏడాది జిల్లా క్రీడాకారులు పలు పోటీల్లో రాణించి అద్భుత ఫలితాలు సాధించారు. జాతీయ, అంతర్జాతీయ, రాష్ట్ర స్థాయిలో పతకాల పంట పండించారు. క్రీడల అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చేపట్టిన కార్యక్రమాలు జిల్లాలో క్రీడల అభివృద్ధికి ఎంతో దోహదపడ్డాయి.

- 2023లో ఉమ్మడి జిల్లాలో క్రీడల్లో పతకాల పంట
- జాతీయ, రాష్ట్ర స్థాయిలో రాణించిన క్రీడాకారులు
- వైఎస్ జగన్ ప్రభుత్వం సహకారంతో మరింత జోష్

2023 రివైండ్ క్రీడలు

ఏలూరు రూరల్: కరోనా సమయంలో నిస్తేజంతో నిండిన క్రీడాకారులను ఉత్సాహపరిచేందుకు, క్రీడాకారులను ఆదుకునేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ క్రీడా నగదు పురస్కారాల పథకం ప్రవేశపెట్టారు. జాతీయ స్థాయిలో పతకాలు సాధించిన జిల్లా క్రీడాకారులకు రూ.1.99 లక్షలు అందించారు. 2021, 2022లో రాష్ట్ర వ్యాప్తంగా సీఎం కప్ పోటీలు నిర్వహించి క్రీడాకారుల ప్రతిభకు పదును పెట్టారు. ఈ ఏడాది ఆడుదాం ఆంధ్ర చేపట్టి మొత్తం క్రీడా లోకంలో జోష్ నింపారు.

వరల్డ్ కప్‌లో మెరిసిన హేమమాధురి

టెన్నికాయిట్ వరల్డ్ కప్ పోటీల్లో దేవరపల్లికి చెందిన జి.హేమమాదురి బ్రాంజ్ మెడల్ సాధించింది. సెప్టెంబర్ 29వ తేదీ నుంచి అక్టోబర్ 8 వరకు సౌతాఫ్రికాలో జరిగిన 5వ టెన్నికాయిట్ వరల్డ్ కప్ పోటీల్లో హేమమాధురి విశాఖపట్టణం క్రీడాకారిణి ఆర్.మౌనికతో కలిసి జూనియర్ డబుల్స్ విభాగంలో పతకం చేజిక్కించుకుంది. పలుసార్లు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించి బాలికల్లో స్ఫూర్తి నింపింది.

అథ్లెటిక్స్‌లో..

తమిళనాడు రాష్ట్రం కోయంబత్తూరులో నవంబర్‌లో జరిగిన 38వ జాతీయ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో ఏలూరుకు చెందిన కైలా శ్యామ్ సుందర్ సాహిల్‌బాబు బంగారు పతకం చేజిక్కించుకున్నాడు. 80 మీటర్ల హార్డిల్స్ రన్నింగ్ కేవలం 10.55 సెకన్లలో పూర్తి చేశాడు. కేరళ కుర్రాడు నెలకొల్పిన 10.61 సెకన్ల రికార్డును అధిగమించి, సరికొత్త జాతీయ రికార్డు సృష్టించాడు. అక్టోబర్ 15వ తేదీ నుంచి 17 వరకు తెలంగాణ రాష్ట్రం హనుమకొండలో జరిగిన సౌత్ ఇండియా అథ్లెటిక్స్ పోటీల్లో ఎస్‌కేబీసీ అథ్లెట్లు ఎస్.లక్ష్మణ, పి.నరేంద్ర, డి.విష్ణువర్ధన్, టి.శ్యామల్‌రాజ్, డి.ఉదయ్, కె.ధనుష్, కె.తిలక్‌పవన్, బి.సుకుమార్, జి.గణేష్, బి.అర్చన, జి.నీలిమ, ఎం.మానస, బి.జాహ్నవి పాల్గొన్నారు. 100, 800, 1500, 400 మీటర్ల హార్డిల్స్ పరుగు పందెం, జావలిన్‌త్రో, డిస్కస్‌త్రో, షాట్‌పుట్ పోటీల్లో పతకాల పంట పండించారు.

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీల్లో..

పల్నాడు జిల్లా నర్సరావుపేటలో డిసెంబర్ 12 నుంచి 14వ తేదీ వరకు నిర్వహించిన ఏపీ స్కూల్ గేమ్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో డిస్కస్‌త్రోలో ఎ.వెంకటేష్ జావలిన్‌త్రో డి.ఉదయ్ గోల్డ్‌మెడల్స్ సాధించారు. బి.సుకుమార్ 200 మీటర్ల పరుగులో గోల్డ్‌మెడల్, 100 మీటర్ల పరుగులో సిల్వర్ మెడల్ సాధించాడు. బాలికల అండర్–17 విభాగంలో బి.జాహ్నవి 100, 200 మీటర్ల పరుగులో రెండు బంగారు పతకాలు సాధించి బెస్ట్ అథ్లెట్ అవార్డు అందుకుంది.



రాష్ట్ర హ్యాండ్‌బాల్ పోటీల్లో చాంపియన్‌గా నిలిచిన జిల్లా జట్టును అభినందిస్తున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ (ఫైల్)

ఖేలో ఇండియా పోటీల్లో..

పంజాబ్ రాష్ట్రం పాటియాలలో ఫిబ్రవరి 20వ తేదీ నుంచి 26 వరకు జరిగిన ఆల్ ఇండియా స్టేట్ లెవల్ పోటీల్లో ఏలూరు ఖేలో ఇండియా సెంటర్ (ఎస్‌టీసీ) అథ్లెట్లు వి.బార్గవి జావెలిన్‌త్రో, షాట్‌పుట్‌లో బంగారు పతకాలు సాధించింది. జి నీలిమా జావెలిన్‌త్రోలో మరో బంగారు పతకం చేజిక్కించుకుంది. ఎం.మానస ఒక రజతం, ఒక కాంస్యం, బి.షాలిని జావెలిన్ త్రోలో మరో రజతం సాధించగా. కె.ధనుష్ ట్రయాథ్లాన్, 60 మీటర్ల పరుగులో రెండు బంగారు పతకాలు సొంతం చేసుకున్నాడు. హేమర్‌త్రోలో పి.వెంకటేష్ మరో బంగారు పతకం సాధించారు.

ఫుట్‌బాల్‌లో..

విశాఖపట్టణంలో సెప్టెంబర్ 22, 23, 24 తేదీల్లో జరిగిన ఏపీ సీనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో జిల్లా ఫుట్‌బాల్ జట్టు విజేతగా నిలిచింది. ఆతిథ్య జట్టుపై 2–1 స్కోర్‌తో గెలుపొంది బాలబాలికల్లో స్ఫూర్తి నింపింది.

బాస్కెట్‌బాల్‌లో..

ఏలూరుకు చెందిన ఎస్‌కే అలీషా, బి.లీలావతి, బి.భవాని రాష్ట్ర బాస్కెట్‌బాల్ జట్టుకు ఎంపికయ్యారు. డిసెంబర్ 3వ తేదీ నుంచి 10 వరకు పంజాబ్ రాష్ట్రం లూథియానలో జరిగిన జాతీయ సీనియర్ బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొన్నాడు.

హ్యాండ్‌బాల్‌లో..

రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా హ్యాండ్‌బాల్ జట్లు చాంపియన్స్‌గా నిలిచాయి. అక్టోబర్ 14, 15, 16 తేదీల్లో కడప డీఎస్‌ఏ స్టేడియంలో జరిగిన పోటీల్లో మహిళల జట్టు కృష్ణా జిల్లా జట్టుపై, పురుషుల జట్టు చిత్తూరు జట్టుపై గెలిచి చాంపియన్స్ ట్రోఫీ అందుకున్నాయి. వీరిలో కె.ప్రభుదేవ, డి.ప్రశాంత్, ఎ.శ్రీరామ్‌యాదవ్, ఎ.సుబాని, డి.రాఖీ, డి.స్వాతి, పుణ్య, ఉమామహేశ్వరి, దుర్గారాణి, జెస్సీ జాతీయ పోటీల్లో పాల్గొన్నారు.



తిరుపతిలో జరిగిన రాష్ట్ర స్థాయి 42వ మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో మెడల్స్ సాధించిన మాస్టర్స్ (ఫైల్)



విశాఖపట్టణంలో జరిగిన రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో విజయం సాధించిన జిల్లా జట్టు (ఫైల్)

స్విమ్మింగ్‌లో..

చిత్తూరు జిల్లాలో డిసెంబర్ 9వ తేదీ నుంచి 11 వరకు జరిగిన 67వ అంతర జిల్లాల స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ స్విమ్మింగ్ పోటీల్లో ఏలూరు నగరానికి చెందిన షేక్ హాకీల్, షేక్ హకీమ్, ఎ.రిషివంత్ పతకాలు సాదించారు. హకీల్ జాతీయ పోటీలకు ఎంపికయ్యాడు.

టేబుల్ టెన్నిస్‌లో..

ఒంగోలులో డిసెంబర్ 8 నుంచి 10 వరకూ జరిగిన రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీల్లో ఏలూరు బాలుడు ఎస్.అచ్యుత్ అండర్–11 విభాగంలో తలపడి కాంస్య పతకం చేజిక్కించుకున్నాడు.

పతకాలు పట్టిన మాస్టర్స్

చిత్తూరు జిల్లా తిరుపతిలో డిసెంబర్ 8వ తేదీ నుంచి 10 వరకు జరిగిన రాష్ట్ర స్థాయి 42వ మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొన్న జిల్లా మాస్టర్స్ 40 మెడల్స్ సాధించారు. ఇందులో 20 గోల్డ్ మెడల్స్, 16 సిల్వర్, మరో 4 బ్రాంజ్ మెడల్స్ ఉన్నాయి. 75 ప్లస్ వయస్సు విభాగంలో ఎం.నరసింహరాజు 100, 200, 400, 4 x 400 మీటర్ల పరుగు పందెంలో 4 గోల్డ్ మెడల్స్, 4 x 100 పందెంలో ఒక సిల్వర్ మెడల్స్ సాధించారు. మహిళల విభాగంలో కె.శాంతకుమారి షాట్‌పుట్, డిస్కస్, జావెలిన్‌త్రోలో మూడు సిల్వర్ మెడల్స్ సాధించారు.

వేసవి శిబిరాలు..

జిల్లా క్రీడాప్రాధికార సంస్థ మే నెలలో బాలబాలికలకు వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహించి పలు క్రీడల్లో తర్ఫీదునిచ్చింది. 50కు పైగా శిబిరాల్లో సుమారు 1500 మంది శిక్షణ పొందారు. పిల్లలకు పోటీలు నిర్వహించి విజేతలకు క్రీడాశాఖాధికారులు సర్టిఫికెట్లు, బహుమతులు అందజేశారు.

'ఆడుదాం ఆంధ్ర'

డిసెంబర్ 26న 'ఆడుదాం ఆంధ్ర' ఆటల పోటీలు జిల్లాలో ప్రారంభమయ్యాయి. ఇందుకోసం ప్రభుత్వం ఆటస్థలాల అభివృద్ధికి రూ.21.72 లక్షలు, ప్రైజ్‌మనీ కోసం రూ.15.50 లక్షలు ఖర్చు చేస్తోంది. లక్షలాది మంది క్రీడాకారులు పాల్గొంటున్నారు.

30న జాబ్ డ్రైవ్

భీమవరం (ప్రకాశంచౌక్): నేషనల్ కెరియర్ సర్వీస్, ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో పట్టణంలోని ఆర్‌ఆర్‌డీఎస్ డిగ్రీ కళాశాలలో ఈనెల 30న జాబ్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ వీకేజే ప్రసూన, జిల్లా ఉపాధి అధికారి సి.మధుభూషణరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్ డ్రైవ్‌లో ఐశ్వర్య ఫెర్టిలిటీ సెంటర్, కుశలవ మోటార్స్, బజాజ్ క్యాపిటల్స్, ముత్తూట్ ఫైనాన్స్ కంపెనీలు పాల్గొంటాయన్నారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ చదివిన వారు అర్హులని, ఆసక్తి గలవారు 93935 75353 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

ఐకమత్యంతోనే సమస్యల పరిష్కారం



భీమవరంలో ర్యాలీ చేస్తున్న విద్యుత్ శాఖ ఓసీ ఉద్యోగులు

భీమవరం: ఎలక్ట్రిసిటీ ఉద్యోగులంతా ఐకమత్యంగా పనిచేయడం ద్వారా సమస్యలను పరిష్కరించుకోవచ్చని విద్యుత్ శాఖ ఓసీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు జి.కరుణాకర్‌రెడ్డి అన్నారు. ఎలక్ట్రిసిటీ ఓసీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ 15వ వార్షికోత్సవం, 2024 డైరీ ఆవిష్కరణ కార్యక్రమాలు భీమవరంలో బుధవారం ఘనంగా జరిగాయి. రాష్ట్రం నలుమూలల నుంచి రెండు వేల మందికి పైగా ఉద్యోగులు హాజరయ్యారు. కోస్తా, ఉత్తరాంధ్ర, రాయలసీమ జిల్లాల నుంచి వచ్చిన ఉద్యోగులు స్థానిక యూత్ క్లబ్ ప్రాంతానికి చేరుకుని అక్కడి నుంచి భారీ ఎత్తున బాణసంచా కాల్పులు, కేరళ వాయిద్యాలతో వేదిక వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో కరుణాకరరెడ్డి మాట్లాడుతూ ఓసీ ఉద్యోగుల సంక్షేమానికి సంఘ సభ్యులు చేస్తున్న కృషిని అభినందించారు. సంఘ పటిష్టతకు, సభ్యుల సంక్షేమానికి మరిన్ని కార్యక్రమాల నిర్వహణ కోసం భవిష్యత్ కార్యాచరణపై సభ్యులు చర్చించారు. గజల్ శ్రీనివాస్ ఆలపించిన గీతాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఆయన ఆలపించిన ఓసీల ఆవేదనా గీతం సీడీని వేదికపై విడుదల చేశారు. చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు డి.శ్రీధర్ వర్మ, కె.శ్రీనివాస్, డిస్కం కార్యదర్శి తురగా రామకృష్ణ, పులి శ్రీరాములు పాల్గొన్నారు.

శాశ్వత లోక్ అదాలత్ సేవలను వినియోగించుకోవాలి



సదస్సులో మాట్లాడుతున్న పర్మినెంట్ లోక్ అదాలత్ చైర్‌పర్సన్ ఎ.మేరీగ్రేస్ కుమారి

ఏలూరు (టూటౌన్): శాశ్వత లోక్‌అదాలత్ సేవలను బ్యాంకులు వినియోగించుకోవాలని శాశ్వత లోక్ అదాలత్ చైర్‌పర్సన్ ఎ.మేరీ గ్రేస్ కుమారి కోరారు. స్థానిక న్యాయసేవాధికార సంస్థ భవన్‌లో బుధవారం బ్యాంకు అధికారులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శాశ్వత లోక్‌అదాలత్‌లో విద్య, పోస్టల్, బీమా, రియల్ ఎస్టేట్, రవాణా, పారిశుధ్యం, బ్యాంకింగ్, ఉపాధి హామీ, టెలికం సేవలలో లోపంపై విచారణ జరుగుతుందన్నారు. అలాగే వివిధ బ్యాంకుల సేవలను ఉపయోగించుకుని తిరిగి చెల్లించని రాని బాకీలు విపరీతంగా పెరిగిపోయినవన్నారు. అటువంటి రాని బాకీల సత్వర పరిష్కారం కోసం శాశ్వత లోక్ అదాలత్‌ను ఉపయోగించుకోవాలని తెలియజేశారు. ఈ శాశ్వత లోక్ అదాలత్‌లో ఇచ్చే తీర్పులకు అప్పీలు ఉండదని ఎటువంటి రుసుము చెల్లించాల్సిన అవసరము లేదన్నారు. సంబంధిత అధికారులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నగరంలోని వివిధ బ్యాంకుల అధికారులు పాల్గొన్నారు.

పాడి రైతులకు ఇతోధిక సేవలు



పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్, పాలకవర్గ సభ్యులు

పెంటపాడు: జిల్లాలో పాడి పరిశ్రమాభివృద్ధితో పాటు పాడి రైతులకు ఇతోధిక సేవలందించేందుకు పాటుపడతానని జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్ పసల కనకసుందరావు అన్నారు. తనకు పదవి ఇచ్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. 12 మంది పాలకవర్గ సభ్యులుగా, మరో ముగ్గురిని నామినేటెడ్ సభ్యులుగా ఎన్నుకున్నట్లు చెప్పారు. పల్లెం అరుణకుమారి (సిద్ధాపురం, ఆకివీడు), మటపర్తి వరలక్ష్మి (వైఎస్ పాలెం, నరసాపురం), కాకులపాటి మల్లేశ్వరి (తోగుమ్మి, కొవ్వూరు), శింగవరపు కుమారి (అర్జావారిగూడెం, భీమడోలు), కురుసం బేబి (గార్లగొయ్యి, పోలవరం), గంటా సుందర్‌కుమార్ (భీమవరం), మరీదు భాలస్వామి (భోగాపురం, పెదవేగి), షేక్ రహీం (సమిశ్రగూడెం, నిడదవోలు), గేదల సూర్యప్రకాష్‌రావు (పోణంగి, ఏలూరు), పెనుమత్స వెంకట సత్యసూర్య నారాయణరాజు, (జిన్నూరు, పోడూరు), గుంటూరు పెద్దిరాజు(కొమ్ముచిక్కాల, పోడూరు), వెలగల అమ్మిరెడ్డి (ఆరవల్లి, అత్తిలి), డాక్టర్ జి.కుమార్‌రాజా (భీమవరం), ఎస్.ఏసుదాసు (భీమవరం), ఎం.విజయ్‌కుమార్ (జంగారెడ్డిగూడెం) ఎన్నికయ్యారన్నారు.

ఆదర్శనీయుడు.. ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్

- రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు
- ఎమ్మెల్సీ వంకకు ఘన సత్కారం



తణుకులో ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్‌ను సత్కరించి జ్ఞాపిక అందజేస్తున్న మంత్రి కారుమూరి, ఎమ్మెల్యేలు జగ్గిరెడ్డి, వాసుబాబు, విజయ్‌బాబు

తణుకు అర్బన్ : నిస్వార్థ రాజకీయ కుటుంబంలో జన్మించి వేలాదిమంది పేద, మధ్య తరగతి వర్గాలకు ఉపాధి కల్పించిన ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్ అభినందనీయులని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. తణుకు సీఎం ఫంక్షన్ హాలులో బుధవారం నిర్వహించిన ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్ సత్కార సభలో ఆయన మాట్లాడారు. రవీంద్రనాథ్ తండ్రి వంక సత్యనారాయణ స్వాతంత్ర్య సమరయోధుడిగా ఎన్నో పోరాటాలు చేశారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అర్హులకు మాత్రమే పదవులు ఇస్తారనడానికి నిదర్శనమే వంక రవీంద్రనాథ్ అన్నారు. పారిశ్రామికంగా ఎంతో ఎత్తుకు ఎదగడమే కాక ఎంతోమంది పేదల భవితకు బంగారుబాట వేసిన ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్ ధన్యుడని కొత్తపేట ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. అటువంటి వ్యక్తిని సత్కరించే కార్యక్రమాన్ని నిర్వహించిన మంత్రి కారుమూరిని ప్రత్యేకంగా అభినందిస్తున్నానని అన్నారు. అత్యున్నత స్థాయి విలువలతో సాధారణ స్థాయి నుంచి ఉన్నత స్థాయికి ఎదిగిన గొప్ప వ్యక్తి ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్ అని ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. వ్యాపార రంగంలో తణుకు లాంటి ప్రాంతం నుంచి విదేశాల వరకు వ్యాపార రంగాన్ని తీసుకువెళ్లి నిరుద్యోగులు, పేద మహిళలకు ఉపాధి కల్పించిన రవీంద్రనాథ్‌ను అభినందించాల్సిందేనని స్పష్టం చేశారు.

నమ్మిన వ్యక్తికి పదవులివ్వడం సీఎం జగన్ ప్రత్యేకత

విలువలున్న వ్యక్తులకు ఉన్నత పదవులిచ్చి గౌరవించడం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఉన్న మంచి అలవాటు అని ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం అధ్యక్షులు పి.విజయబాబు అన్నారు. ఆ కోటాలోనే ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్ శాసనమండలికి సభ్యులుగా ఎన్నికయ్యారని స్పష్టం చేశారు. అనంతరం వంక రవీంద్రనాథ్‌ను మంత్రి కారుమూరి చేతులమీదుగా ఘనంగా సత్కరించగా ఎమ్మెల్యేలు చిర్ల జగ్గిరెడ్డి, పుప్పాల వాసుబాబు ప్రత్యేకంగా అభినందించారు. రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ గుబ్బల తమ్మయ్య, ఏఎంసీ మాజీ చైర్మన్ చిట్టూరి శ్రీవెంకట సుబ్బారావు, యువనేత కారుమూరి సునీల్‌కుమార్, కాపు సంఘం జిల్లా అధ్యక్షులు చినిమిల్లి వెంకటరాయుడు, అత్తిలి, తణుకు ఏఎంసీ చైర్మన్‌లు బుద్దరాతి భరణి ప్రసాద్, నత్తా కృష్ణవేణి, ఎంపీపీ ఆర్.ధనరాజు, డీసీఎంఎస్ డైరెక్టర్ పెన్మెత్స సుబ్బరాజు, రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మెహర్ అన్సారీ, జెడ్పీటీసీలు అడ్డాల జానకి, ఎం.అన్నపూర్ణదేవి తదితరులు పాల్గొన్నారు.

హృద్రోగులకు అందుబాటులో తక్షణ వైద్యం

- ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు
- కైకలూరు సీహెచ్‌సీలో ప్రత్యేక గది, ఆన్‌లైన్ సేవలు ప్రారంభం



కైకలూరు సీహెచ్‌సీలో హృద్రోగుల కోసం ప్రత్యేక గదిని ప్రారంభించిన అనంతరం వైద్యుల నుంచి వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే డీఎన్నార్

కైకలూరు: గుండె వ్యాధిగ్రస్తుల ప్రాణాలను నిలబెట్టడానికి కైకలూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో తక్షణ వైద్యం అందుబాటులోకి వచ్చిందని కైకలూరు ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు చెప్పారు. బుధవారం ఆస్పత్రిలో నిర్వహించిన సీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. గుండెపోటుకు గురైన వారిని తక్షణం కైకలూరు ఆస్పత్రికి తీసుకువస్తే వైద్యులు ఆన్‌లైన్ ద్వారా ప్రముఖ గుండె వ్యాధి నిపుణులతో మాట్లాడి చికిత్స అందిస్తారన్నారు. ఆస్పత్రిలో రూ.35 వేలు ఖరీదు చేసే ఇంజెక్షన్ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని, ఇటువంటి రెండు ఇంజెక్షన్లు ఎప్పుడూ సిద్ధంగా ఉంటాయన్నారు. ఈ ఇంజెక్షన్ వల్ల మెరుగైన వైద్యం అందించడానికి సమయం ఉంటుందన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్యశ్రీ సేవలను రూ.25 లక్షల వరకు పెంచారన్నారు. కైకలూరు సీహెచ్‌సీని 30 పడకల నుంచి 50 పడకలకు అప్‌గ్రేడ్ చేశామన్నారు. ప్రస్తుతం 46 మంది సిబ్బంది ఇక్కడ పనిచేస్తున్నారని, ప్రతి రోజూ 200 మంది ఓపీ ఉండగా, దీనిని 500కు పెంచే చర్యలు తీసుకోవాలన్నారు. త్వరలో ఆరు బెడ్‌ల డయాలసిస్ సెంటర్‌ను అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. సీహెచ్‌సీ సూపరింటెండెంట్ బి.దుర్గాప్రసాద్ ఆస్పత్రికి కావల్సిన మౌలికావసరాలను అజెండా రూపంలో వివరించారు. ఆస్పత్రి కమిటీ సభ్యులు దూలం శ్యామ్ ఫణికుమార్, శ్యామలాలు అజెండాలో మార్పులు చేయాలని సూచించారు. తొలుత సీహెచ్‌సీలో హృద్రోగుల కోసం ప్రత్యేక గది, ఆన్‌లైన్ సేవలను, ఇతర యంత్ర పరికరాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఎంపీపీ అడవి కృష్ణ, ఏలూరు జిల్లా వైఎస్సార్‌సీపీ సేవాదళ్ కమిటీ అధ్యక్షులు బలే నాగరాజు, సర్పంచ్ దానం మేరీ నవరత్న కుమారి, వైస్ ఎంపీపీ మహమ్మద్ జహీర్, ఏలూరు జిల్లా బీసీ కమిటీ సెక్రటరీ ముంగర గోపాలకృష్ణ, జిల్లా పంచాయతీరాజ్ విభాగ కమిటీ సెక్రటరీ గండికోట ఏసుబాబు పాల్గొన్నారు.

క్రీడాకారులు గీతారెడ్డి, సుబ్బన్నరెడ్డిలకు సత్కారం





మార్టేరులో సత్తి గీతారెడ్డిని సత్కరిస్తున్న శ్రీరంగనాథరాజు, తమ్మయ్య, మార్టేరులో సుబ్బన్నరెడ్డిని సత్కరిస్తున్న దృశ్యం

పెనుమంట్ర: మార్టేరుకు చెందిన అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులు గీతారెడ్డి, సుబ్బన్నరెడ్డిలను స్ఫూర్తిగా తీసుకుని ఈప్రాంతంలోని ఎంతోమంది విద్యార్థులు జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్నారని ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. బుధవారం మార్టేరులోని ఎస్వీజీ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో జరిగిన ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాలలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న అంతర్జాతీయ అథ్లెటిక్స్ క్రీడాకారిణి, డబుల్ ఒలింపియన్ సత్తి గీతారెడ్డి, ఇంటర్నేషనల్ బాస్కెట్‌బాల్ క్రీడాకారుడు, నర్సాపురం ఆర్టీసీ డిపో మేనేజర్ సత్తి సుబ్బన్నరెడ్డిలను శ్రీరంగనాథరాజు, రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ తమ్మయ్య ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీడలలో రాణించి ఈప్రాంతానికి మంచి పేరు తీసుకురావడమే కాక ఎందరికో స్ఫూర్తిగా నిలిచారని అభినందించారు. గుబ్బల తమ్మయ్య మాట్లాడుతూ గీతారెడ్డి, సుబ్బన్న కళాశాలలలో తన శిష్యులు కావడం గర్వంగా ఉందన్నారు. పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సూపర్‌వైజర్ దుర్భాషలాడాడని..

పురుగుమందు తాగి కార్మికుడి ఆత్మహత్య

తణుకు: మిల్లులో సూపర్‌వైజర్ దుర్భాషలాడాడనే మనస్తాపంతో ఓ కార్మికుడు పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాలిలా ఉన్నాయి. ఇరగవరం మండలం సూరంపూడి గ్రామానికి చెందిన ఈరి లక్ష్మణ్ (24) తణుకులోని ఓ స్పిన్నింగ్ మిల్లులో గత కొన్నేళ్లుగా పనిచేస్తున్నాడు. ఇటీవల మిల్లులో సరిగా పనిచేయడం లేదంటూ లక్ష్మణ్‌ను సూపర్‌వైజర్ అశోక్ దుర్భాషలాడాడు. దీంతో మనస్తాపం చెందిన లక్ష్మణ్ ఈనెల 25న రాత్రి ఇరగవరం మండలం గోటేరు గ్రామ శివారులో పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. బాధితుడిని చికిత్స నిమిత్తం తణుకులోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా మంగళవారం రాత్రి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటనపై కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇరగవరం హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

ప్రకృతి వ్యవసాయంపై ఆసక్తి పెంచుకోవాలి

తాడేపల్లిగూడెం : ప్రకృతి వ్యవసాయంపై అవగాహన పెంచుకోవాలని డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన వర్సిటీ డీన్ ఆఫ్ హార్టీకల్చర్ ఏఎస్ పద్మావతమ్మ కోరారు. భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి ప్రణాళికననుసరించి సేంద్రియ, ప్రకృతి వ్యవసాయంపై రెండు రోజుల పాటు సాగే శిక్షణా కార్యక్రమం బుధవారం ప్రారంభమైంది. పద్మావతమ్మ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ఆవశ్యకత, ప్రస్తుత వ్యవసాయ పద్ధతుల్లో చేపట్టాల్సిన విషయాలపై సూచనలు చేశారు. కేవీకే శాస్త్రవేత్త ఎం.రాఘవేంద్రరెడ్డి మాట్లాడుతూ సేంద్రియ కర్బన ప్రాముఖ్యత, జీవన ఎరువుల వినియోగంపై వివరించారు. డీపీఎం తాతారావు (ఏలూరు), ప్రకృతి వ్యవసాయ రైతుల విజయ గాథలను కొత్త రైతులకు తెలియజేశారు. శిక్షణలో భాగంగా మహిళా రైతులకు వెంకట్రామన్నగూడెం, నాచుగుంట, వెల్లమిల్లి, సింగరాజుపాలెంలలో ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను చూపించారు. క్షేత్రస్థాయి విషయాలను ఆకళింపు చేసుకుంటే రైతులకు మేలు జరుగుతుందన్నారు. కేవీకే శాస్త్రవేత్తలు ఎ.దేవీవరప్రసాద రెడ్డి, కె.వెంకటసుబ్బయ్య, మొహమ్మద్ వలి, అడిషినల్ డీపీఎం విజయకుమారి పాల్గొన్నారు.

కె సముద్రపుగట్టు ఉపసర్పంచ్ పదవికి రాజీనామా

అత్తిలి: మండలంలోని కె సముద్రపుగట్టు ఉపసర్పంచ్ యాళ్ల అనిత తన పదవికి రాజీనామా చేశారు. వ్యక్తిగత కారణాల వల్ల ఉపసర్పంచ్ పదవికి రాజీనామ చేశానని, రాజీనామా పత్రాన్ని ఎంపీడీవో ఎండీ అమీలుజమాకు బుధవారం అందజేసినట్లు మండల పరిషత్ కార్యాలయ అధికారులు పేర్కొన్నారు.

బంగారు భవిష్యత్‌కు పాఠశాలలే పునాది

తాడేపల్లిగూడెం: విద్యార్థుల బంగారు భవిష్యత్‌కు పాఠశాల దశలోనే పునాది వేసుకోవాలని నిట్ సెర్ప్ ప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్ శ్రీఫణికృష్ణ కర్రి అన్నారు. నిట్ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగం, సెర్ప్ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం సైంటిఫిక్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కార్యక్రమం నిర్వహించారు. ఫణికృష్ణ మాట్లాడుతూ నూతన పరిశోధనలతో కొత్త శిఖరాలను అధిరోహించాలన్నారు. విభిన్నమైన ఆలోచనలు ప్రతి ఒక్క విద్యార్థి జీవితంలో భాగం కావాలన్నారు.ఈ కార్యక్రమంలో ఆచార్యులు వి.సందీప్, టి.రమేష్, పి.శంకర్, కిరణ్ తీపర్తి తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



తాడేపల్లిగూడెం రూరల్: వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న సంపత్‌కుమార్



తణుకు టౌన్: వేల్పూరులో వాలీబాల్ ఆడుతున్న మహిళలు

తాడేపల్లిగూడెం రూరల్: క్రీడల ద్వారా ఉత్సాహం... ఆరోగ్యం లభిస్తాయని ఏఎంసీ చైర్మన్ ముప్పిడి సంపత్‌కుమార్ అన్నారు. ఆడుదాం ఆంధ్ర ఆటల పోటీల్లో భాగంగా బుధవారం మండలంలోని మాధవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వాలీబాల్, కబడ్డీ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏఎంసీ చైర్మన్ సంపత్ కుమార్ మాట్లాడుతూ ప్రస్తుత హడావిడి జీవితంలో శారీరక మానసిక వికాసానికి క్రీడలు ఎంతగానో ఉపకరిస్తాయన్నారు. ప్రతి ఒక్కరిలో క్రీడల పట్ల ఆసక్తి పెంపొందించేందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్ఠాత్మకంగా రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లోనూ ఆడుదాం ఆంధ్ర ఆటల పోటీలను ప్రారంభించినట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంత క్రీడాకారులను ప్రోత్సహించడానికి ఈ కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ క్రీడల ద్వారా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ జడ్డు హరిబాబు, వెంకట్రావుపాలెం సర్పంచ్ ఎలిపే గాంధీ, ఏఎంసీ మాజీ డైరెక్టర్ తమ్మిశెట్టి చుక్కయ్య, పంచాయతీ కార్యదర్శి ఆర్‌వీ.బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు. కృష్ణాయపాలెంలో కంఠమని సత్యనారాయణ, నక్కా గంగాధర్, గజ్జరపు రామకృష్ణ, పుట్టా ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.



పెంటపాడు: మీనవిల్లూరులో మారథాన్ యాత్ర నిర్వహిస్తున్న దృశ్యం

ఉత్సాహంగా ఆడుదాం ఆంధ్ర క్రీడాపోటీలు

అత్తిలి: ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా అత్తిలి మండలం ఆరవల్లి, బల్లిపాడు, కొమ్మర, అత్తిలి గ్రామాల్లో గల జెడ్పీ ఉన్నత పాఠశాలల క్రీడా ప్రాంగణాలలో బుధవారం క్రీడా పోటీలు జరిగాయి. వాలీబాల్, షటిల్, క్రికెట్, ఖోఖో పోటీల్లో క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. మండల ప్రత్యేక అధికారి కె మురళీకృష్ణ, ఎంపీడీవో అమీలుజమా క్రీడాపోటీలను పర్యవేక్షించారు. క్రీడాకారులను పరిచయం చేసుకుని క్రీడలను ప్రారంభించారు.

రెండో రోజూ ఉత్సాహంగా ఆడుదాం ఆంధ్ర క్రీడోత్సవాలు

తణుకు టౌన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం తణుకు మండలంలోని వివిధ గ్రామాల్లోని క్రీడా పోటీలు రెండవ రోజూ కొనసాగాయి. బుధవారం తణుకు మండలంలోని వేల్పూరు, దువ్వ, మండపాక, తేతలి తదితర గ్రామాల్లో రెండో రోజు వాలీబాల్, షటిల్ బాడ్మింటన్ పోటీల్లో యువత ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ పోటీల్లో గ్రామ కార్యదర్శులు వీ గంగాధరరావు, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడలతోనే మంచి ఆరోగ్యం

పెంటపాడు: మండలంలో రెండో రోజు ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం ఉత్సాహభరితంగా సాగింది. మొదటి రోజు కన్నా రెండోరోజు యువత అన్ని గ్రామాల్లో పాల్గొని క్రీడల్లో సత్తా చాటారు. మీనవిల్లూరు జెడ్పీస్కూల్లో కొండేపాడు, రామచంద్రపురం యువత నాయకులు మారథాన్ యాత్ర నిర్వహించారు. పార్టీ బీసీసంఘ నాయకులు లింగమూర్తి, కొండేపాడు సర్పంచ్ కట్టా దానయ్య తదితరులు మాట్లాడుతూ గ్రామీణ క్రీడాకారుల ప్రతిభను గుర్తించేందుకు ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం ఉపయోగపడుతుందన్నారు.

నవరత్నాలతో సంక్షేమ వెలుగులు

తాడేపల్లిగూడెం అర్బన్: ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి రూపొందించిన నవరత్నాల పథకాలు లబ్దిదారులకు ఆర్థిక ప్రయోజనాన్ని అందిస్తున్నాయని పట్టణ కన్వీనర్ కర్రి భాస్కరరావు తెలిపారు. బుధవారం పట్టణంలో 28,30,31,32 వార్డుల్లో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ నవరత్నాలు, ఇతర సంక్షేమ పథకాలు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్నారన్నారు. మళ్లీ ఈ పథకాలు కొనసాగలంటే మళ్లీ జగన్‌ను సీఎం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలనతో పాటు గ్రామల అభివృద్ధికి పెద్దపేట వేస్తున్నారని అన్నారు. రాబోయే ఎన్నికలలో వైఎస్సార్ సీపీకి ఘన విజయం అందించాలని కోరారు. జగన్ సహకారంతో నియోజకవర్గాన్ని వందలకోట్ల రూపాయలతో అభివృద్ధి చేస్తున్న ఉపముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణను ఎమ్మెల్యేగా గెలిపించేందుకు నియోజకవర్గ ప్రజల సిద్ధంగా ఉన్నారన్నారు. రాజకీయాల్లోకి వచ్చినప్పటి నుంచి ప్రజా రక్షణకు అహర్నిశలు పాడుపడుతున్న నాయకుడు కొట్టు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో శీలి మేరీ కుమారి, షఫీ, వట్టి బుజ్జి, కావని అశోక్, పట్నాల గణపతి, పొట్లపల్లి రాంబాబు, కోడే అప్పారావు, మారిశెట్టి రమణ పందిరిపల్లి రామయ్య, స్థానిక మహిళలు, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



32వవార్డులో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

గూడెం ఎంఎల్‌ఎస్ పాయింట్‌లో విజిలెన్స్ తనిఖీలు

పెంటపాడు: మండలంలోని ప్రత్తిపాడులో ప్రభుత్వం చౌకడిపోలకు పంపిణీ చేసే పౌరసరఫరాల గోదాములను(ఎంఎల్‌ఎస్ పాయింట్) బుధవారం ఆకస్మిక తనిఖీలు జరిగాయి. ఈ సందర్భంగా విజిలెన్స్ డీఎస్పీ సి. వెంకటేశ్వరరావు, విజిలెన్స్ తహసీల్దార్ కన్యాకుమారిలు చౌకడిపోలకు అందించే బియ్యం, అంగన్‌వాడీ సెంటర్‌లకు అందించే సరుకుల నాణ్యతను, స్టాక్‌ను పరిశీలించారు. ఉన్న స్టాక్‌కు రిజిస్టర్ నమోదు అయిన స్టాక్‌కు సరిపోవడంతో సంతృప్తి వ్యక్తం చేసారు. ఈ దాడుల్లో సిబ్బంది, గోదాముల నిర్వాహకులు పాల్గొన్నారు.

తణుకు నియోజకవర్గ గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడిగా సప్పా

తణుకు అర్బన్: తణుకు వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు సప్పా బలరామకృష్ణ తణుకు నియోజకవర్గ గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడిగా ఎన్నికైన సందర్భంగా బుధవారం రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ వంకరవీంద్రనాథ్‌లు అభినందించారు. ఈ సందర్భంగా బలరామకృష్ణ మాట్లాడుతూ తనకు ఈ పదవి అప్పగించిన మంత్రి కారుమూరికి కృతజ్ఞతలు తెలిపారు. ఏఎంసీ మాజీ చైర్మన్ చిట్టూరి శ్రీవెంకట సుబ్బారావు, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా అందజేత

పెంటపాడు: పేద ప్రజలకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అండగా ఉంటుందని పెంటపాడు గ్రామ సర్పంచ్ తాడేపల్లి సూర్యకళ పేర్కొన్నారు. పెంటపాడు కునాకరపేటకు చెందిన వంకా శ్రీనివాసరావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. అతనికి వైఎస్సార్ బీమా వర్తింపు కార్యక్రమంలో భాగంగా రూ. 2 లక్షలు అందించేందుకు స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు ఏర్పాట్లు చేశారు. మట్టి ఖర్చుల కోసం తక్షణసాయంగా రూ.10వేలు బుధవారం ఆమె భార్య కనకలక్ష్మికి అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ కొవ్వూరి ప్రసాద్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు రెడ్డి సూరిబాబు, వార్డు సభ్యులు బర్ల జయరాం బాబు, రెడ్డి సూరిబాబు, వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడిగా హరిబాబు

తాడేపల్లిగూడెం రూరల్: వైఎస్సార్ సీపీ తాడేపల్లిగూడెం మండల నూతన కార్యవర్గాన్ని నియమిస్తూ జిల్లా పార్టీ ఉత్తర్వులు జారీ చేసింది. మండల పార్టీ అధ్యక్షుడిగా జడ్డు హరిబాబు, ఉపాధ్యక్షుడిగా మేణ్ణి రామారావు, ఎం.వెంకటేశ్వర రెడ్డి, కార్యదర్శులుగా చిట్టూరి కాశీవిశ్వనాథం, మద్దుకూరి మెహెర్‌ప్రసాద్, పాకనాటి తాతాజీ, గంటి సర్వేశ్వరరావు, పత్స వీరవెంకట్రాజు, సంయుక్త కార్యదర్శులుగా అడ్డాల గోపీకృష్ణ, కల్లేపల్లి బలరామకృష్ణంరాజు, కంకట రాజారత్నం, మర్లపాటి వెంకటరత్నం, పెండెం భాస్కరరావు, తాడేపల్లి మోషే, గజ్జరపు రామకృష్ణ, ములకాల చినశ్రీనులు నియమితులయ్యారు.

ఈవీఎంలపై అవగాహన

తణుకు టౌన్: పట్టణ, గ్రామాల్లో ఓటర్లు ఈవీఎం, వీవీ ప్యాట్లపై సందేహాలను నివృత్తి చేసుకొనేందుకు అవగాహన కేంద్రాలను వినియోగించుకోవాలని తహసీల్దార్ పీఎన్‌డీ ప్రసాద్ కోరారు. బుధవారం దువ్వ, తేతలి గ్రామాల్లో పోలింగ్ కేంద్రాల వద్ద అవగాహన సదస్సులు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌వో ఏ గోవర్ధనరావు, డిప్యూటీ తహసీల్దార్ సూర్యనారాయణరాజు, వీఆర్‌ఓలు నిమ్మలపూడి సుధాకర్, ఎం వెంకటేష్, దువ్వ, తేతలి గ్రామాలకు చెందిన ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.